


ఫిలింనగర్‌లోని గీతాంజలి స్కూల్‌లో గురువారం ఓటేయడానికి వేచి ఉన్న ఓటర్లు

# ఖైరతాబాద్ నియోజకవర్గంలో.. 52.7శాతం పోలింగ్

- గత ఎన్నికలతో పోలిస్తే రెండు శాతం తగ్గిన ఓటింగ్
- బస్తీల్లో తక్కువ పోలింగ్ కావడంతో ఆందోళన
- కాలనీల్లో సాధారణం కంటే ఎక్కువ ఓటింగ్

బంజారాహిల్స్,డిసెంబర్ 1: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని శాసనసభ ఎన్నికల్లో మొత్తం 52.07శాతం ఓటింగ్ నమోదైంది. 2018 శాసనసభ ఎన్నికల్లో 53.74శాతం మంది ఓటేయగా ఈసారి స్వల్పంగా తగ్గింది. నియోజకవర్గంలో మొత్తం 2,96,014 ఓటర్లు ఉండగా వారిలో 154,146 మంది ఓటేశారు. ఓటు వేసిన వారిలో 79,507మంది పురుష ఓటర్లు ఉండగా 74,624మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా ఫిలింనగర్‌లోని గీతాంజలి స్కూల్‌లో ఏర్పాటు చేసిన 179 పోలింగ్ కేంద్రంలో 71.15శాతం పోలింగ్ శాతం నమోదైంది. అత్యల్పంగా జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని రౌండ్‌టేబుల్‌స్కూల్‌లోని 174 పోలింగ్ కేంద్రంలో నమోదైంది. ఇక్కడ కేవలం 33.88శాతం మాత్రమే ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. గతంలో కాలనీలు, అపార్ట్‌మెంట్స్‌కు చెందిన పోలింగ్ కేంద్రాల్లో అతి తక్కువ పోలింగ్ కేంద్రం నమోదయ్యేది. అయితే ఈసారి ఎన్నికల్లో కాలనీలలో సాధారణం కంటే ఎక్కువగా పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గతంలో కంటే స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. అయితే బస్తీల్లోని కొన్ని పోలింగ్ బూత్‌లలో అతి తక్కువ పోలింగ్ శాతం నమోదు కావడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. తక్కువ ఓట్లు నమోదైన ప్రాంతాల్లో ఓటింగ్ సరళి ఎలా ఉంటుందనే అంశంపై అభ్యర్థులు తర్జన భర్జన పడుతున్నారు.

### ఎక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలు

| పోలింగ్ కేంద్రం పేరు (సంఖ్య) | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు (శాతం) |
|---|---|---|
| 1.గీతాంజలి మోడల్ స్కూల్, ఫిలింనగర్(179) | 780 | 555 (71.15) |
| 2.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ హాల్ | 1203 | 739 (66.83) |
| 3.సెయింట్ అంద్రూస్ పబ్లిక్ స్కూల్(103) | 637 | 417 (65.46) |
| 4.భారతీయ విద్యాభవన్ జూబ్లీహిల్స్(186) | 908 | 593 (65.31) |
| 5.సర్వేభవన్ ,నారాయణగూడ(6) | 978 | 638 (65.24) |

### అత్యల్పంగా పోలింగ్ శాతం నమోదైన కేంద్రాలు

| | | |
|---|---|---|
| 1. రౌండ్‌టేబుల్ స్కూల్,ఫిలింనగర్(174) | 656 | 431(33.88) |
| 2. సెయింట్ జోసెఫ్ స్కూల్,హిమాయత్‌నగర్(15) | 722 | 263(36.43) |
| 3. దేవరకొండబస్తీ కమ్యూనిటీహాల్ (195) | 890 | 325(36.52) |
| 4. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్, రోడ్ నెం 13(227) | 1266 | 480(37.91) |
| 5. రిచ్‌మండ్ స్కూల్. కమలాపురి కాలనీ(141) | 1497 | 578 (38.48) |

## ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా...



ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినాన్ని పురస్కరించుకొని ఎల్బీనగర్‌లోని బంజారా మహిళా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయుక్తంగా చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం నగరంలోని బొల్లారం పరిధిలో ఉన్న డిజైర్ ఎయిడ్స్ సంరక్షణ కేంద్రంలో ఉన్న విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేశారు.
– సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)

## మోదీ హయాంలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ,డిసెంబర్ 1: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు బీపీ మండల్ నివేదిక ఒక భగవద్గీత అని,సామాజిక న్యాయప్రధాత బీపీ మండల్ అని పేర్కొన్నారు.బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలు మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు.ఆ రెండు పార్టీలు బీసీల సంక్షేమంపై ఏ మాత్రం చిత్తశుద్ధిలేదని దుయ్యబట్టారు.నాడు బీపీ మండల్ చేసిన ఉద్యమాల ఫలితమే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి నేషనల్ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ హక్కులు కల్పించేలా జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 1 : ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిల్డ్రన్ డాక్టర్ మంచుకొండ రంగయ్య అన్నారు. కందూరి కృష్ణ ఫౌండేషన్, సేట్ మానిక్ లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.




నగరం సుందరీకరణలో భాగంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న విద్యుత్ స్తంభాలకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో శుక్రవారం పూల తొట్లను ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకట్టుకున్నాయి.

## విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ,డిసెంబర్ 1: మనస్థాపంతో రైలు కిందపడి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. ఈదీబజార్, తలప్‌కట్ట మహ్మద్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సలీం కుమార్తె ఉమేర సబీన్ (19) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. కొన్ని నెలలుగా ఉమేర సబీన్ ఆరోగ్యం బాగలేదు. దవాఖానల చుట్టూ తిరిగినా నయం కాలేదు. శుక్రవారం మనస్థాపంతో యాకుత్‌పుర – ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల నడుమ ఎదురుగా వచ్చిన రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉమేర సబీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

